# సమీకృత వ్యవసాయం ద్వారా ఆర్థికాభివృద్ధి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- ములకలపల్లిలో కలెక్టర్ పర్యటన..



**టి మీడియా,అక్టోబర్ 21,ములకల పల్లి:** సమీకృత వ్యవసాయం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు . మంగళవారం ఆయన ములకలపల్లి మండలంలోని పలు గ్రామాలను విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రాజుపేట గ్రామంలో చింతకాయల నాగేశ్వరరావు, కుమారి దంపతులు నిర్వహిస్తున్న కౌజు పిట్టల యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. మండల సమైక్య సహాయంతో రుణం పొందిన రైతు, కౌజు పిట్టలతో పాటు నాటు కోళ్లు మరియు మేకల

మిగతా 3లో

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 12
సంచిక : 76
పేజీలు : 3

బుధవారం, అక్టోబర్ 22, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# పేదల పక్షపాతిగా పాలన



- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**టి మీడియా,అక్టోబర్,21, కూసుమంచి( ఖమ్మం):** పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం పాలన చేస్తున్నదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి కూసుమంచి మండలంలోమంగళవారం పర్యటించి పలు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.... నేలపట్ల గ్రామంలో ముదిగొండ రోడ్డు నుంచి కొత్త చెరువు వరకు రూ. 2 కోట్ల 75 లక్షలతో బీటి రోడ్డు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. మునిగేపల్లి నుంచి వీరేంద్ర స్వామి దేవస్థానం వయా వెంకటాపురం మీదుగా 8 కిలోమీటర్ల మట్టి రోడ్డు రూ. 3 కోట్లతో మంజూరు చేశామని, త్వరలోనే ఆ పనులకు శంకుస్థాపన చేస్తామని అన్నారు.

నేలపట్ల గ్రామంలో రూ. 34 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించామని, మరో 15 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అంగన్వాడి భవనానికి రూ. 5 లక్షలు, త్రాగునీటి మరమ్మతు పనులకు రెండు లక్షల రూపాయలు, ప్రజా ప్రభుత్వంలో గడిచిన 22 నెలల కాలంలో మొత్తంగా రూ. 6 కోట్ల 31 లక్షల రూపాయలు నేలపట్ల గ్రామ అభివృద్ధికి మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ధర్మతండ గ్రామంలో రూ. 3 కోట్ల 75 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. లోక్య తండా నుంచి ధర్మ తండా వరకు కోటి 26 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన రోడ్డు ప్రస్తుతం టెండర్ దశలో ఉందని, వర్షాకాలం లోపు ఆ రోడ్డు శంకుస్థాపన చేస్తామని, రాబోయే వర్షాకాలంలోపు ఈ రోడ్లు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని అన్నారు. గత 22 నెలల కాలంలో ప్రజల ఆశీర్వాదంతో ధర్మతండా గ్రామానికి రూ. 46 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు నిర్మించుకున్నామని అన్నారు. రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించామని, మొత్తం ధర్మతండా గ్రామానికి రూ. 5 కోట్ల 95 లక్షల నిధులు అభివృద్ధి కోసం మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పేదల ఆశీర్వాదంతో వచ్చిన ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్తు,

మిగతా 3లో

# పోలీసుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పోలీస్ అమరుల సంస్కరణ దినం





**టి మీడియా,అక్టోబర్ 21,ఖమ్మం:** శాంతి భద్రతల సంరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం పోలీసు పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించిన పోలీసు అమరవీరులకు ప్రతి ఒక్కరూ నివాళులు అర్పించాలని అన్నారు. ప్రభుత్వంలో ప్రతి శాఖ పని తీరులో పోలీస్ సహకారం సంపూర్ణంగా ఉంటుందని అన్నారు. భూ సేకరణ, ధాన్యం కొనుగోలు, ఎన్నికల నిర్వహణ, శాంతియుతంగా వేడుకలు జరగాలన్నా కూడా ప్రతి ఒక్క అంశంలో పోలీస్ సహకారం అవసరమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా యంత్రాంగానికి పోలీసులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని అన్నారు. దీపావళి, హెూళి, వినాయక నిమజ్జనం వంటి అనేక పండుగలు ప్రశాంతంగా జరుపు కోవడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతి పౌరులు పోలీసుల గొప్పతనం తెలుసుకోవాలని, కృతజ్ఞతగా ఉండాలని, కానిస్టేబుల్ నుంచి డీజీపి వరకు నేర నియంత్రణ కోసం పాటు పడుతారని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే 100 కు ఫోన్ చేస్తారని, అన్ని విపత్కర సమయాలలో మొదటగా స్పందించేది పోలీసులు మాత్రమే నని, 24 గంటల పాటు డ్యూటీలో ఉంటారని అన్నారు. పోలీసులు ప్రతిరోజు కుటుంబ సమయాన్ని త్యాగం చేస్తూ మన కోసం విధులు నిర్వహిస్తున్నారని, అటువంటి వారిపట్ల మనం నిరంతరం గౌరవ భావంతో ఉండాలని అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు శాంతి చేకూరాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూలి 21 అక్టోబర్ 1959 లద్దాక్ ప్రాంతంలో దేశ సరిహద్దు కాపాడటంలో 10 మంది సిఆర్పిఎఫ్ సిబ్బంది చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి మరణించారని, విధులలో ఉండి మరణించిన పోలీసుల త్యాగాలకు చిహ్నంగా మనం నేడు పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంగా భారత దేశ వ్యాప్తంగా శాంతిభద్రతలు కాపాడేందుకు 191 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రతి పోలీసు వ్యక్తికి దేశం మొదటి ప్రాధాన్యతగా ఉండాలని అన్నారు. డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూలి పోలీస్ యూనిఫామ్ చాలా పెద్ద బాధ్యత అని, ప్రతి రోజు క్రిమినల్స్ తో పోరాటం, చాలా కష్టాలతో విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు.

**అనంతరం విధి నిర్వహణలో అమరులైన**

పోలీసులకు స్మారక స్థూపం వద్ద జిల్లా కలెక్టర్, పోలీసు కమీషనర్, అటవీశాఖ అధికారి పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ పేరడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించగా, పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబీకులు పూలమాలలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత, అమర వీరుల స్మృత్యర్థం సాయుధ బలగాలు పెరేడ్, గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. అనంతరం పోలీసు ఆయుధాలు కిందకు దింపి వందనం చేసి రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి లు ప్రసాద రావు, రామానుజం, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# పట్టపగలే మహిళ దారుణ హత్య

## -కారుతో ఢీకొట్టి , కత్తితో గొంతు కోసిన దుండగులు..

**టీ మీడియా, అక్టోబర్ 21, నూతనకల్ఆ(త్మకూరు ఎస్ ):** పట్టపగలు గ్రామం నడిబొడ్డు నుండి నడిచి వెళ్తున్న మహిళను గుర్తు తెలియని దుండగులు కారుతో ఢీకొట్టి కింద పడిన మహిళను కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటన మండల కేంద్రంలోని ఏపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొరివి బిక్షమమ్మ(39) తన భర్త కొరివి మల్లయ్యతో ఉన్న తగాదాను పెద్దల సమక్షంలో మాట్లాడి వస్తుండగా గ్రామం నడిబొడ్డున గుర్తు తెలియని వ్యక్తులు వీధిలో నడిచి వస్తున్న బిక్షమమ్మను వెనుక నుండి కారుతో ఢీకొట్టి, కిందపడిన మహిళను దుండగులు కారు నుండి దిగి, తన వెంట తెచ్చుకున్న కత్తితో భిక్షమమ్మ గొంతుపై దారుణంగా పొడిచి హత్య చేశారు.

ఈ సంఘటనతో బిక్షమమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు భిక్షమమ్మకు తన భర్త కొరివి మల్లయ్యకు గత కొంతకాలంగా గొడవలు కొనసాగుతున్నాయి. మృతురాలి భర్త మల్లయ్య లారీ డ్రైవర్ గా పనిచేస్తుండగా వారికి ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు భరత్ హైదరాబాదులో మెకానిక్ గా పని చేస్తుండగా చిన్న కుమారుడు ప్రవీన్ సూర్యాపేట లోచికెన్ సెంటర్ లో పనిచేస్తున్నాడు. మృతరాలు బిక్షమమ్మ ఇతరులతో అక్రమ సంబంధం ఉన్నదని భర్త మల్లయ్య కుటుంబ సభ్యులు తరచూ అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలతో గొడవ పడుతుండేవారు. ఈ విషయమై పెద్దలు పలుమార్లు పంచాయతీలు చేసి సర్ది చెప్పినట్లు తెలిసింది. ఇటీవల సూర్యాపేటకు చెందిన ఒక దేశ గురువు భిక్షమమ్మతో చనువుగా ఉండడంతో కుటుంబ సభ్యులు దేశ గురువుతో పాటు భిక్షమమ్మను మందలించారు.తీరు మార్చుకొని భిక్షమమ్మను మంగళవారం తన భర్త మల్లయ్య పెద్దల సమక్షంలో మందలించేందుకు స్థానిక ఒక పార్టీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. పెద్దలు ఇరువురిని సముదాయించి పంపించిన కొద్దిసేపటికే బిక్షమమ్మ ఆ పార్టీ కార్యాలయ సమీపంలో దారుణ హత్యకు గురైంది.సమాచారం తెలుసుకున్న సూర్యాపేట డిఎస్పి ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తో క్లూజ్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. రక్తపు

మిగతా 3లో

# కంపలతో మూసుకుపోయిన రహదారి

## -ఇబ్బందులు పడుతున్న ప్రజలు

## - సొంత ఖర్చులతో బాగు చేసిన రవి

**టీ మీడియా అక్టోబర్ 21 కామేపల్లి :** అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు...ఈ ఆర్ అండ్ బి రహదారి గుండా ప్రయాణం అంటేనే రైతులు, ప్రజలు, ప్రయాణికులు... తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు... కానీ వారి ఇబ్బందులను చూడలేక ఓ యువకుడు నడుం బిగించి ముందుకు వచ్చి తన సొంత ఖర్చులతో రహదాన్ని శుభ్రం చేయించాడు. దీంతో ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు... వివరాలు ఇలా ఉన్నాయి డోర్నకల్ నుండి పండితాపురం ( వయా బండిపాడు) ఆర్ అండ్ బి రహదారి కి ఇరువైపులా చెత్త చెదారం, చెట్లు ముళ్ళపోదలు దట్టంగా అల్లుకొని ఉండటంతో ఈ రహదారి గుండా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.రాత్రి వేళలో వచ్చే వాహనాలు కనపడకపోవడంతో ఎదురు ఎదురుగా ఢీకొని పలు ప్రమాదాలు జరిగాయి. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.ఇప్పటికి ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడి ప్రజలు, రైతులు, ప్రయాణికులు ఈ రహదారి విషయాన్ని సంబంధిత ఆర్ అండ్ బి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన వారు స్పందించకపోవడంతో. బండిపాడు గ్రామానికి చెందిన యువకుడు ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గుగులోతు రవి తన సొంత ఖర్చులతో రహదారి వెంట ఉన్న చెత్త, చెదారం, చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలను మంగళవారం తొలగించారు. దీంతో పలువురు రైతులు,ప్రయాణికులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.రవి దాతృత్వాన్ని పలువురు



గ్రామస్తులు, రైతులు, ప్రయాణికులు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నిరంతరం ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలనే సంకల్పంతో ముందు సాగుతున్నామని తెలిపారు. రానున్న కాలంలో రుక్కీ తండ గ్రామ పంచాయతీ లో ఉన్న గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆ ధ్యేయంతో ముందుకు సాగుతానని వెల్లడించారు.





## సింగరేణిలో పట్టుబడ్డ నకిలీ పురుగుమందుల ముఠా

**టీ మీడియా, అక్టోబర్ 21, సింగరేణి (కారేపల్లి):** గ్రామాల్లో తిరుగుతూ పురుగుమందులు విక్రయిస్తున్న ముఠాను ఆదివారం రోజున స్థానికుల సమాచారం మేరకు సింగరేణి ఎస్సై బైరు గోపి, ఏవో బట్టు అశోక్ కుమార్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పండితాపురం గ్రామానికి చెందిన సంతోష్ సీడ్స్ ఫెర్టిలైజర్ షాప్ వారు నేరుగా పురుగుమందులను రైతులకు సింగరేణి మండలంలో ఇటువంటి రసీదులు లేకుండా విక్రయిస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకోవడం జరిగిందన్నారు. అనంతరం వారిని ముందుగా స్థానిక పోలీసులకు సమాచారంతో పోలీస్ స్టేషన్కు తరలించి ఆ తరువాత మండల వ్యవసాయ అధికారి కి అప్పజెప్పడం జరిగిందన్నారు. ఈ విషయంపై విచారణ జరపగా నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి పురుగుమందులను నేరుగా ఎటువంటి రసీదులు లేకుండా చట్టవిరుద్ధంగా రైతులకు అంటగడుతున్నారన్నారు.ఆ సరుకుకి ఎటువంటి రసీదులు గాని ఆధారాలు గాని లేకపోవటంతో పంచనామా నిర్వహించి ఆ నలుగురు పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా మారుమూల గ్రామాలలో ద్విచక్ర వాహనాలపై ఆటో ట్రాలీలలో మందులు, ఎరువులు,విత్తనములు విక్రయాలు జరుపితే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. దీనిపై ప్రత్యేక నిఘ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.రైతులు వ్యవసాయ శాఖ వారిచే లైసెన్సు కలిగిన దుకాణాలలోనే ఎరువులు, పురుగుమందులు, విత్తనములు కొనుగోలు చేయాలని సూచించారు. ఊర్లలో తిరుగుతూ అమ్మే వారి దగ్గర రైతులు కొని మోసపోకూడదని, అలా ఎవరైనా చేస్తే మా దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా సింగరేణి ఏవో రైతులకు తెలిపారు.





## వైద్యం వికటించి మూగజీవాలు మృత్యువాత

### న్యాయం చేయాలని బాధిత రైతుల డిమాండ్

**టీ మీడియా, అక్టోబర్ 21, సింగరేణి (కారేపల్లి):** వైద్యం వికటించి మూగజీవాలు మృత్యువాత పడిన ఘటన కారేపల్లి మండలంలో చోటుచేసుకుంది. బాధిత రైతులు తెల్పిన వివరాలు ప్రకారం గిద్దవారిగూడెంకు చెందిన జర్పుల లాల్సింగ్ తన మేక కాలుకు పిన్సింగ్ వైరు గ్రుచ్చుకోవటంతో దానిని కారేపల్లి ప్రభుత్వ పశు వైద్యశాలకు తీసుకెళ్లాడు. పశువైద్య సిబ్బంది మేకకు ఇంజక్షన్ వేశారు. మేకను ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే మేక నాలుగు కాళు చచ్చు పడిపోవడంతో మరల తిరిగి కారేపల్లి లోని పశు వైద్యశాలకు తీసుకువెళ్లాడు. కారేపల్లి భరత్నగర్కు చెందిన సోమందుల నాగరాజు తన ఇంట్లో పెంచుతున్న పందెం కోడికి పశు వైద్యశాలలో ఇంజక్షన్ చేయించాడు. ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే కోడి మృతి చెందడంతో బాధితుడు పశువైద్య సిబ్బందిని నిలదీశాడు. ఈనెల 19న సామ్యతండాలో సైతం వాంకుడోత్ రాముకు చెందిన బర్రె దూడకు పశు వైద్య సిబ్బంది నట్టల నివారణ మందులు వేశారు. దాంతో బర్రెదూడ ఆరోగ్యం బలహీన పడడంతో రైతు కారేపల్లి ప్రభుత్వ పశు వైద్యశాలకు తీసుకురాగా వైద్య సిబ్బంది మూడు ఇంజక్షన్లు చేయడం దూడ అదే రోజు రాత్రి మృతి చెందినట్లు బాధిత రైతు రాము తెలిపాడు. తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మండల పశు వైద్యాధికారి ఎం.ఉపేందర్ ను మీడియా వివరణ కోరగా వైద్య సిబ్బంది ఇచ్చిన మందులు, ఇంజక్షన్ల వల్ల ఎటువంటి ప్రాణ హానికరం ఉండదన్నారు. వాటికి ఉన్న జబ్బుల మూలంగానే అవి మృతిచెంది ఉంటాయన్నారు. ఇంజక్షన్ చేసిన తర్వాత మేక కాళ్లు బలహీన పడడం సాధారణమేనని దానిని వైద్య సిబ్బంది పరిశీలనలో ఉంచనున్నట్లు తెలిపారు.



## ఎరువుల దుకాణాలలో అకస్మిక తనిఖీలు

**వైరా ఏడిఏ - టీ. కరుణ శ్రీ**

**టీ మీడియా, అక్టోబర్ 21, సింగరేణి (కారేపల్లి):** సింగరేణి మండలం లో వైరా ఏడిఏ తుమ్మలపల్లి.కరుణశ్రీ ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు సేల్స్ రిజిస్టర్ లను పరిశీలించి, గోడౌన్లలో ఉన్న ఎరువులకు, పిఓఎస్ మిషిన్ల లో ఉన్న స్టాకు ను పరిశీలించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామాలలో తిరుగుతూ ఎరువులను, పురుగుమందులను, విత్తనములను విక్రయించకూడదని అలా ఎవరైనా చేస్తే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాలలో ఎవరైనా రైతులకు ఎరువులు ,పురుగు మందులు, విత్తనములు విక్రయిస్తున్నట్లయితే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారుల కైన పోలీసు అధికారులకు అయినా సమాచారం ఇవ్వాలని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ వారిచే లైసెన్సు పొందిన దుకాణాలలోనే ఎరువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఏవో. బట్టు అశోక్ కుమార్, ఏఈఓ లు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి



**టీ మీడియా, అక్టోబర్ 21, సింగరేణి (కారేపల్లి):** వ్యవసాయ యాంత్రికరణ పథకం కింద వ్యవసాయ పనిముట్లు కావల్సిన రైతులు ధరఖాస్తు చేసుకోవలని మండల వ్యవసాయాధికారి బట్టు అశోక్కుమార్ తెలిపారు. మంగళవారం కారేపల్లిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు లను ఈనెల 24వ తేది లోపు తమ క్లస్టర్ పరిధిలో గల ఏఈఓ లకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో భాగంగా ఎస్ఎంఏఎం పథకం కింద బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, నాప్ సాక్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, ట్రాక్టర్ పనిముట్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు, బ్రష్ కట్టర్లు, వరి గట్లు తయారు చేసే మిషన్, వరిగడ్డిమోపు తయారు చేయు యంత్రము సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు దరఖాస్తు ఫారం తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టా పాస్ బుక్ జిరాక్స్, పాస్ ఫోటోను జత చేయవలసిందిగా కోరారు. ట్రాక్టర్ పనిముట్లు కావలసిన రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టా పాస్ బుక్ జిరాక్స్, పాస్ ఫోటో తో పాటు ట్రాక్టర్ కాగితాలను జత చేయవల్సి ఉంటుందన్నారు.

## ఆవులను ఢీకొని మోటర్ సైకిలిస్టు మృతి



**టీ మీడియా, అక్టోబర్ 21, సింగరేణి (కారేపల్లి) :** రోడ్డుపై వెళ్తున్న ఆవులు ఒక్కసారి బెదిరి రోడ్డు మధ్యకు రావటంతో వాటిని ఢీకొన్న మోటర్ సైకిలిస్టు మృతి చెందిన ఘటన కారేపల్లి పెట్రోల్ బంక్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెల్పిన వివరాలు, కూల్డ్రింక్స్ హెూల్సేల్ షాపు సీసీ పుటేజీలో నిక్షిప్తమైన వివరాల ప్రకారం.. కారేపల్లి మండలం బక్కలతండాకు చెందిన మాలోత్ నరేష్(38) అయ్యప్ప మాల ధరించి ఉన్నాడు. పండగ పూట పిండి వంటలకు కావల్సిన పిండిని మరపట్టించటానికి మోటర్ సైకిల్పై తన ఇద్దరు పిల్లలతో కలిసి కారేపల్లి వస్తున్నాడు. పెట్రోల్ బంక్ మూలమలుపు వద్ద వెంకిట్యాతండాకు చెందిన కేలోత్ భద్రు తన దుక్కిటావులను మేపటానికి తోలుకెళ్తున్నాడు. భద్రు మోటర్ సైకిల్ పై ఉండి ఆవులను తీసుకవెళ్తున్నాడు. ఇదే క్రమంలో వెనక నుండి మాలోత్ నరేష్ మోటర్ సైకిల్పై వస్తుండగా అవులు ఒక్కసారే బెదిరి రోడ్డు మధ్యలోకి వచ్చాయి. దీంతో వాటిని ఢీకొట్టిన నరేష్ మోటర్ సైకిల్ పై నుండి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై సృహ కోల్పోయాడు.మోటర్ సైకిల్పై వెనక కూర్చున్న పిల్లలు స్వల్ప గాయలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన నరేష్ను ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య విజయ,కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయ్యప్పమాల ధరించిన నరేష్ మృతితో గ్రామంలో విషాదఛ్చాయలు నెలకొన్నాయి. దీనికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీమా ఏజెంట్లను నియమించటకు దరఖాస్తులు



**టీ మీడియా అక్టోబర్ 21 ఖమ్మం :** తపాలా శాఖ బీమా పథకాలు అయితే తపాలా జీవిత బీమా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్( పి ఎల్ ఐ )మరియు గ్రామీణ తపాలా జీవిత బీమా (రూరల్ పోస్టల్ వైస్ ఇన్సూరెన్స్ ఆర్ పి ఎల్ లకు సంబంధించిన సంబంధించి బీమా ఏజెంట్లను కమిషన్ పద్ధతిలో తాత్కాలిక ప్రతిపాదిక నియమించట కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఉమ్మడి జిల్లా పోస్టల్ సూపర్డెంట్ శ్రీ వి . వీరభద్ర స్వామి తెలిపారు పదో తరగతి పూర్తి చేసి 18 సంవత్సరాలు వయసు నిండిన నిరుద్యోగులు అంగన్వాడి సేవకులు మహిళా మండల సేవకులు పంచాయతీ సంచార కేంద్రాల సేవకులు మరియు మాజీ సైనికులు సైనిక ఉద్యోగులు రిటైర్డ్ అయిన ప్రభుత్వ ఉద్యోగులు గ్రామీణ తపాల సేవకులు అర్హులు తెలియ తెలిపారు ఆసక్తిగల అభ్యర్థులు 27 10 2025 సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు పోస్టల్ సూపర్డెంట్ గారి కార్యాలయం గాంధీ చౌక్, ఖమ్మం -507003 చేరేలా దరఖాస్తులను టెన్త్ మెమో ఆధార్ పాన్ కార్డు జిరాక్సను జత పంపించగలరు తెలియజేస్తున్నారు . ఎన్నిక కాబడిన అభ్యర్థులు 5000 /- రూపాయలను ఎన్ఎస్సి లేదా కేవీపీ రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చేయవలెను పూర్తి వివరాలు మీ దగ్గర గల తపార కార్యాలయం సంప్రదించగలరని తెలిపారు.

## బస్తీ బాటతో అంతరాయం లేని విద్యుత్



**టీ మీడియా, అక్టోబర్ 21, తుంగతుర్తి,:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా చేయాలని లక్యంతో బస్తి బాట నిర్వహిస్తున్నటు తుంగతుర్తి విద్యుత్ శాఖ ఏఈ సురేందర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని బండ రామారం గ్రామంలో సమస్యలు గుర్తించి, పరిష్కరించడం జరిగింది. ఇక మీదట ప్రతి మంగళ,గురు,శని వారాలు బస్తిబాట నిర్వహించడం జరుగుతుంది. గ్రామాల్లోని వీధుల్లో ఏమైనా సమస్యలు ఉంటే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

## విద్యార్థినులకు నాణ్యమైన భోజనం : ఆర్డీఓ అశోక్ రెడ్డి

**టి మీడియా,అక్టోబర్ 21,కట్టంగూర్ :**



విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆర్డీఓ యారాల అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కట్టంగూర్ లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. నిర్మాణంలో ఉన్న జూనియర్ కళాశాల భవనం, రికార్డులు, భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా భోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ పుష్పలత, ఎస్ఓ నీలాంబరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## నేటి నుండి కామేపల్లి లో కార్తీక మాస ఉత్సవాలు

**టీ మీడియా ,అక్టోబర్ 21 ,కామేపల్లి:** శివునికి అత్యంత ప్రీతి పాత్రమైనకార్తీక మాస ఉత్సవాలుఈనెల 22 నుండి నవంబర్ 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు గొట్టిపర్తి శివాజీ తెలిపారు స్థానిక బాలత్రిపుర సుందరి ఇష్టకామేశ్వరి స్వామి దేవాలయం ప్రాంగణంలోని గురు మందిరంలో కార్తీక మాసం పురస్కరించుకొని నిత్యం శివునికి రుద్రాభిషేకం అష్టోత్తర శతనామ పూజలు జరుగుతాయని అదేవిధంగా విశేష దినములైన నాగుల చవితి సోమవారాలు ఏకాదశి కార్తీక పౌర్ణమి మాస శివరాత్రి వంటి ప్రత్యేక రోజులలో విశేష పూజలు నిర్వహిస్తారని ఈ సందర్భంగా శివాభిషేకం చేయించుకోదలచినవారు కమిటీ వారిని సంప్రదించాలని అదేవిధంగా శివారాధన చేసి దేవునికి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## గాలివానతో నేలకొరిగిన వరి



**టీ మీడియా, అక్టోబర్ 21, కోదాడ:** కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీనితో 150 ఎకరాలకు పైగా వరి పంట నేలకొరిగింది. దీనితో రైతులు లబోదిబోమంటున్నారు. వరి పైరు నష్టపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం రాష్ట్రం ఉపాధ్యక్షుడు అన్నెం పాపిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతాంగం కష్టాల్లో ఉందని వెంటనే ఆదుకోవాలని కోరారు.

## త్వరలోనే రోడ్డు మరమ్మత్తు పనులు



### మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్

**టీ మీడియా, అక్టోబర్ 21, మణుగూరు :** ప్రజల చేత చిత్కారానికి గురై అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయ ఉనికి కోసం ఉబలాట పడుతున్నారని, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్ ధ్వజమెత్తారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామాల అభివృద్ధిని చూసి ఓర్వలేక రోడ్ల మరమ్మత్తులు చేపట్టడం లేదంటూ ప్రజలకు అసత్యాలను ప్రచారం చేస్తు మభ్య పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. వారు చెప్పే మాటలను, సోషల్ మీడియాలో చేసే ప్రచారాలను నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.బీఆర్ఎస్ పాలనలో నాయకులు సృష్టించిన విధ్వంస పాలనకు ప్రజలు విసిగి చెంది వారికి దిమ్మ తిరిగే విధంగా తీర్పు చెప్పిన వారి వైఖరిలో మార్పురావడం లేదన్నారు. నియోజకవర్గం సుభిక్షంగా ఉందని, భయభ్రాంతులకు గురికాకుండా ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులను ఆర్ అండ్ బి శాఖ ప్రారంభిస్తుందని పేర్కొన్నారు. పబ్లిక్ సిటీ కోసం రోడ్లపై ఫోటోలు దిగుతూ పనికిరాని పోస్టులు పెడుతూ సోషల్ మీడియాలో లైకుల కోసం బిఆర్ఎస్ నాయకులు పోటీ పడుతున్నారని ఎద్దేవ చేశారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు ప్రచారాలను పక్కనపెట్టి పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిని చూడాలని హితవు పలికారు.

## నేస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



**టీ మీడియా, అక్టోబర్ 21, బూర్గంపాడు :** మండలంలోని నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన షేక్ ఖావుద్దిన్ పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగలేక మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సంప్రదించాడు. వారు వెంటనే స్పందించి నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున రూ.6,000, సంకా సురేష్ రూ.1000, మొత్తం రూ.7000 రూపాయలను అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండా రెడ్డి మట్లాడుతూ షేక్ ఖావుద్దిన్ కు 67 సంవత్సరాలు ఉన్నప్పటికీ కనీసం వృద్ధాప్యం ఫించన్ రాకపోవడం లేదని, పూరి గుడిసె కావడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నాడని తెలిపారు. వీరి కుటుంబానికి ప్రభుత్వం వృద్ధాప్య ఫించన్ ,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.నేస్తం ట్రస్ట్ తరుపున అధికారులను కోరుతూ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింత అంకిరెడ్డి,సెక్రటరీ ఇండ్ల వెంకట రాజేష్ ,గౌరవ సలహాదారులు సంకా సురేష్ ,సభ్యులు కైపు రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్‌డిఆర్ సేవలు మరువలేనివి

### -ఎమ్మెల్సీ పింగళి శ్రీ పాల్ రెడ్డి..



**టీ మీడియా, అక్టోబర్ 21, తుంగతుర్తి:** దివంగత మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధనలో, ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే తన ప్రాణంగా, ఆస్తులను పోగొట్టుకొని చివరి శ్వాస వరకు పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేసిన నాయకుడు ఆర్ డి ఆర్ అని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి కొనియాడారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నివాసంలో మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, దామోదర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి.. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పరామర్శించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు సూర్యాపేట జిల్లా అధ్యక్షులు తంగేళ్ళ జితేందర్ రెడ్డి, జిల్లా,డివిజన్, మండల, భాద్యులు తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



**టీ మీడియా, అక్టోబర్ 21, జాజిరెడ్డిగూడెం(అర్వపల్లి):** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్)ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం సూర్యాపేటలో మంగళవారం మండల మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరెడ్డిగూడెం మండల టీఎస్ యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్ సోమయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా కోటమర్తి వీరయ్య(ఎస్.ఏ జెడ్పీహెచ్ఎస్ అర్వపల్లి), ప్రధాన కార్యదర్శిగా నల్లగంటి వెంకన్న(ఎస్జీటీ ఎంపీపీఎస్ రామన్నగూడెం), ఉపాధ్యక్షులుగా కాకి సీనయ్య, మహిళా ఉపాధ్యక్షురాలుగా విజిత, కోశాధికారిగా ఉప్పునూతల శేఖర్, కార్యదర్శులుగా గౌతమి, వెంకటేశ్వర్లు, నాగయ్యలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ విద్యా పరిరక్షణకు నూతన కార్యవర్గం కృషి చేయడంతో పాటు సంఘం అభివృద్ధికి పాటుపడతామని అన్నారు. తదనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించి అభినందించారు.



## దర్జాగా ఇసుక దందా

### పాలేరు వాగు నుండి ఆకేరు వాగు వరకు..

**టీ మీడియా, అక్టోబర్ 21, మరిపెడ :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో దర్జాగా అక్రమ ఇసుక రావణా దందా జరుగుతున్నది. మండలంలోని పలు వాగుల నుంచి కొన్ని రోజులుగా ఇసుక అక్రమ రవాణా ఇచ్చిన వేడుక సాగుతుంది. కొందరు ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరు చెప్పి ఇసుకను జిల్లాకు దాటేస్తున్నారు. మరికొందరు తమకు అనుకూలమైన ప్రాంతాలలో వాటిని నిల్వచేసి తర్వాత ఎక్కువ రేటుతో ఆ ఇసుకను విక్రయిస్తున్నారు. తానంచర్ల శివారు పాలేరు వాగు నుండి ప్రతిరోజు 20 నుంచి 40 ట్రాక్టర్ల వరకు అక్రమ ఇసుక రవాణా దందా జోరుగా సాగుతున్నది.

**అధికారపక్ష నాయకుల అండదండలతో**

ఈ దందా ఇంత జోరుగా సాగడానికి ఇసుక అగ్రమా రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులకు అధికారపక్ష నాయకుల అండ దండాలు ఉన్నాయని వారి అండదండలతోటి ఇసుక అక్రమ రవాణా దందా దర్జాగా కొనసాగుతుందని స్థానికుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ట్రాక్టర్లు పట్టుకున్న సందర్భాల్లో కొందరు వ్యక్తులు రాజకీయ నాయకులతో నేరుగా అధికారులకు ఫోన్లు చేపిస్తుండడంతో వారిని వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**నామమాత్రంగా దాడులు**

నామమాత్రంగా పోలీసులు అధికారులు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ అక్రమ దందాలో అధికారుల వాటా ఎంతనే పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ ఇసుక అరికట్టాలని ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్ ఫోర్సును కూడా ఏర్పాటు చేసింది ఒకటి రెండు రోజులు సెలవులు వస్తే చాలు అక్రమ ఇసుక ట్రాక్టర్లకు అదుపు లేకుండా పోతుంది ఫిర్యాదు చేసిన సమయంలో అధికారులు ఒక ట్రాక్టర్ కొట్టుకోవడం మిగతా ట్రాక్టర్లలను వదలడం పరిపాటిగా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.




## సింగరేణి ఫారెస్ట్ డిపార్మెంట్ లో అవనీతి

### -ఇరువై అయిదు సంవత్సరాలు గా ఒకే కాంట్రాక్టర్ కి టెండర్

**టి మీడియా,అక్టోబర్ 21,కొత్తగూడెం:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం సింగరేణి కార్పొరేట్ ఫారెస్ట్ డిపార్మెంట్ అంత అవినీతిమయం అవుతుందని టెండర్ వేద్దాం అనుకున్న కాంట్రాక్టర్స్ వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కొత్తగూడెం ఫారెస్ట్ డిపార్మెంట్ లో అవినీతిమయంలో కూరుకుపోయిందని సింగరేణి లో మైన్ కర్ర సప్లై సంబంధించి టెండర్ కు పిలుస్తారు కానీ అసలు కదా ఇక్కడే మొదలైంది ఓకె ఒక కాంట్రాక్టర్ కి గత ఇరువై అయిదు సంవత్సరాల నుండి టెండర్ కాంట్రాక్ట్ దక్కుతుంది అది ఎలా సాధ్యపడుతుంది అంటే టెండర్ కమిటీలో ఉన్న ఫారెస్ట్ అధికారులు సదర కాంట్రాక్టర్ తో కుమ్మక్కై ఎక్స్పిరియన్స్ ఉండాలి అన్న నెపంతో వేరే కాంట్రాక్టర్స్ నీ టెండర్లో పాల్గొనకుండా చేసి ఓకె కాంట్రాక్టర్ కి టెండర్ సప్లే కాంట్రాక్ట్ ను ఇస్తున్నారు సదరు కాంట్రాక్ట్ నుండి భారీగా ముడుపులు కూడా అందుకుంటున్నారంట అమ్ముడు పోవుచున్నారు వేరే కాంట్రాక్టర్స్ నీ టెండర్ వేయకుండా చేసి సదరు కాంట్రాక్ట్ ఇచ్చే డబ్బులకు కక్కుర్తి పడి వేరే కాంట్రాక్టర్స్ నీ దరి చేరకుండా అవినీతికి ఆజ్యం పోస్తున్నారు దీనికి ప్రాజెక్ట్ మరియు ప్లానింగ్ డిపార్మెంట్ వారి హస్తం ఉన్నట్టు తెలుస్తుంది కేవలం ఎక్స్పిరియన్స్ పేరుతో వేరే కాంట్రాక్టర్స్ ను టెండర్ వేయకుండా చేస్తున్న వారిపై సి అండ్ ఎండి దృష్టి సారించి వేరే కాంట్రాక్టర్స్ నీ కూడా టెండర్ లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కాంట్రాక్టర్స్ కోరుతున్నారు.

## సమీకృత వ్యవసాయం ద్వారా ఆర్థికాభివృద్ధి



పెంపకం చేపడుతున్నట్టు కలెక్టర్‌కు వివరించారు. రైతు తెలిపిన ప్రకారం, 300 కౌజు పిట్టల పెంపకం చేపట్టామని ఇప్పుడు పంట చేతికి వచ్చిందని దీని ద్వారా నెలకు సుమారు 15,000 ఆదాయం పొందుతామని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న సంవత్సరంలో జిల్లాలో 500 చేపల పెంపక యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, చేపల పెంపకంతోపాటు అదే ప్రాంగణంలో కౌజు పిట్టలు, నాటు కోళ్లు, మేకల పెంపకం వంటి సమీకృత వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా చేపల పంట చేతికి వచ్చేంతవరకు రైతులు నెలవారీ ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ ఆదాయాన్ని రైతులు చేపల పెంపకానికి తీసుకున్న రుణాలకు ఈఎంఐగా చెల్లించడం ద్వారా ఆర్థికభారం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే, రైతు పామాయిల్ సాగులో అంతర్పంటగా మునగ సాగు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. తదుపరి పూసగూడెం గ్రామంలోని డంపింగ్ షెడ్లో గ్రామపంచాయతీ వర్కర్లు తయారు చేస్తున్న బయోచార్ (జీవ బొగ్గు) తయారీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎండిన చెట్ల కొమ్మలు, తుమ్మ వంటి పదార్థాలను చిన్న ముక్కలుగా చేసి మంట ద్వారా బయోచార్ తయారుచేసే విధానాన్ని సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విధంగా తయారైన బయోచార్‌ను గోమూత్రం మరియు గోవుపేడలో కొన్ని రోజులు నానబెట్టి ఆరబెట్టి పొడిచేసి పంటలకు సేంద్రియ ఎరువుగా వాడితే భూసారం మెరుగుపడి అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు. గ్రామపంచాయతీలు చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని ఆయన ఆదేశించారు. డంపింగ్ యార్డుల్లో తయారైన కూరగాయ వ్యర్థాల కంపోస్ట్ ఎరువును కూడా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ పాతగంగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణవాటికను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో ముచ్చటించి, వారికి అందిస్తున్న ఆహారం గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషణవాటిక ఏర్పాటు చేసి, పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు ఉచితంగా అందిస్తున్నారని సిబ్బంది వివరించారు. కేంద్రంలో పెంచిన ఆరు రకాల ఆకుకూరలను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని ఆకుకూరలు ఒకేసారి కాకుండా వారానికోసారి మారుస్తూ అందుబాటులో ఉంచాలని సూచించారు. మునగ, వెలగా, చింత, ఉసిరి, కరివేపాకు వంటి మొక్కలను కూడా పెంచాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణీల కోసం ప్రత్యేకంగా పోషకవాటికలను అభివృద్ధి చేయడం ద్వారా వారికి సమృద్ధమైన పోషకాహారం అందించవచ్చని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన, తాసిల్దార్ గన్యా నాయక్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతిగా పాలన

ఉగాది నుంచి రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం, నూతనంగా పేద కుటుంబాలకు రేషన్ కార్డుల జారి, పాత రేషన్ కార్డులలో నూతన సభ్యుల పేర్ల నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.రైతును రాజు చేయడంలో భాగంగా మొదటి ఏడాదిలో 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల 2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని, ప్రస్తుత సీజన్లో కూడా బోనస్ ఇవ్వడానికి క్యాబినెట్ నిర్ణయించిందని, రాబోయే వారం నుంచి పది రోజులలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. పేద ప్రజలకు భరోసా, ధైర్యం అందించేలా ఇందిరమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం నిర్మిస్తుందని, పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫాలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మన నేలపట్ల గ్రామంలో మొదటి విడత క్రింద 18 ఇండ్లు మంజూరు చేశామని, పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామని అన్నారు. పేదల పక్షపాతిగా ఉన్న ప్రజా ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా భవిష్యత్తులో కూడా అర్హుడైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే మహిళ దారుణ హత్య

మడుగులో పడి ఉన్న మహిళ మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పట్టపగలు ఇంత సాహసోపేతంగా హత్యకు పాలపడటం చుస్తే ఇది పక్క ప్రణాళికతో చేసిన హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు.నడిరోడ్డు పై మహిళను దారుణంగా హత్య చెయ్యడంతో తమకు రక్షణ కరువైందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మృతురాలి భర్త మల్లయ్య కుటుంబ సభ్యులతో పాటు, దేశ గురువు కుటుంబ సభ్యులు, మల్లయ్య అన్న కుటుంబ సభ్యులపైన అనుమానాలు ఉన్నట్లు సమాచారం.